***17 డిసెంబర్ 2018***

***REJOINDER***

*ప్రభుత్వ ఆదేశాల మేరకే ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ కు అనుబంధంగా ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సహకార పరపతి సంఘాన్ని సహకార సంఘాల చట్టాలకు అనుగుణంగా 50 కోట్ల రూపాయల మూలధనంతో నెలకొల్పడం జరిగింది. ఈ సంఘం సుమారు 50 వేల మంది సభ్యులతో గత మూడేళ్లకు పైబడి విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతున్నది. అన్ని సహకార సంఘాల లాగే బ్రాహ్మణ సహకార పరపతి సంఘం కూడా వ్యాపార కార్యకలాపాలలో భాగం గా వివిధ రకాల రుణ సదుపాయాలు, తగినన్నీ ఆస్తులను తనఖాగా ఉంచుకుని, చట్ట ప్రకారం కావలసిన జాగ్రత్తలు అన్ని తీసుకున్న మీదట తన సభ్యులకు తనఖా రుణాలు అందజేస్తున్నది. పత్రికలో పేర్కొన్న కోటి రూపాయల ఋణం విషయంలో కూడా తగు జాగ్రత్తలు, తనఖా హామీ పత్రాలు స్వీకరించిన తరవాతనే ఋణం మంజూరీ చేయడం జరిగింది. ఈ విషయంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదు.. సొసైటీ నిబంధనల మేరకు అర్హులైన సభ్యులకు వారు ఏ పార్టీకి చెందిన వారయినప్పటికి ఋణం మంజూరు చేయబడుతుంది. ఇందులో ఎటువంటి వివక్షత కు తావు లేదు. అయితే ఈ ఋణం కధనంలో పేర్కొన్న పత్రికలో పేర్కొన్నట్లుగా సంస్థ డైరెక్టర్ కు ఇవ్వలేదు.*

*శాసనసభ్యులు లేదా నియోజక వర్గ ఇంచార్జుల సిఫారసు మేరకే రుణాలు మంజూరు చేస్తున్నారన్న వార్తలో నిజం లేదు. స్థానిక శాసనసభ్యుడి పరిచయ పత్రాన్ని కేవలం దరఖాస్తుదారుడి నివాసాన్ని అర్హతలను ధృవీకరించుకోవడం కోసం మాత్రమే (అదీ చాణక్య పధకం సబ్సిడీ మంజూరు విషయంలో మాత్రమే) గతంలో కోరడం జరిగింది. ప్రభుత్వం అర కొర నిధులు కేటాయించారన్న విషయం నిజము కాదు. కార్పొరేషన్ అధికారులు తమ ప్రణాళికల మేరకు నిధులు ఏ మేరకు అవసరమవుతాయి అనే విషయం అంచనాలు తయారు చేసుకుని సమర్పించిన ప్రతిపాదనల మేరకే ప్రభుత్వం కేటాయింపులు జరుపుతుంది. కార్పొరేషన్ కు ఇంతవరకు నిధుల కొరత ఏనాడు ఏర్పడలేదు. నిధుల కొరత వలన ఏ పధకం అమలుకు అవరోధం ఏర్పడలేదు. విద్యార్థులకు అందజేసే స్కాలర్షిప్ లలో కోట విధించారనడం సరి కాదు. వివిధ తరగతుల విద్యార్థుల ఆర్థిక అవసరాలు సమీక్షించిన మీదట, వాస్తవిక దృక్పధం తో సవరించి అధిక సంఖ్యలో ఉపకార వేతనాల ప్రయోజనాలు విద్యార్థులకు అందజేయడం జరుగుతున్నది. గతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే ఇవ్వబడుతున్న ఉపకార వేతనాలు ప్రయివేటు పాఠశాల విద్యార్థులకు కూడా ఒకటో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు మంజూరు చేయడం జరుగుతున్నది. ఈ సవరణ పట్ల విద్యార్థుల నుంచి గాని, తల్లిదండ్రులనుంచి గాని ఎటువంటి ఫిర్యాదులు లేవు. మరీ ముఖ్యంగా*

"భారతి" "గాయత్రీ" పథకాల క్రింద సంతృప్త స్థాయిలో (saturation mode) మంజూరు చేయడం జరుగుతున్నది.

ఈ రోజు వరకు ఒక లక్ష నలభై రెండు వేల మంది అర్హులయిన పేద బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా నిబంధలు మేరకు ప్రయోజనం చేకూర్చడం జరిగింది.

“గాయత్రి విద్యా ప్రశస్తి”, “భారతి విద్యా పథకం”, “వేదవ్యాస వేద విద్యా పథకం” క్రింద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉపకార వేతనాలు అందజేస్తున్నాము. సివిల్ సర్వీసెస్, గ్రూపు-1, బ్యాంకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు హాజరయ్యే బ్రాహ్మణ యువతకు “వశిష్ట” పదకం క్రింద ఆర్థిక సహకారాన్ని అందజేయడం జరుగుతున్నది. అలాగే బ్రాహ్మణ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు “ద్రోణాచార్య” పథకం పేరిట గుర్తింపు పొందిన సంస్థలలో బ్రాహ్మణ యువతీ యువకులకు శిక్షణ ఇప్పించడం జరుగుతున్నది. బ్రాహ్మణ యువత కేవలం ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా వారిలోని వాణిజ్య వ్యాపార కాంక్షలు నిజం చేయడానికి “చాణక్య” పథకం క్రింద వ్యాపార, పారిశ్రామిక సంస్థలు నెలకొల్పదలచుకున్న యువతకు సబ్సిడీ తో కూడిన ఋణాల మంజూరు చేస్తున్నాము. “కశ్యప” పథకం పేరిట పేద, 14 ఏళ్ళ లోపు అనాధ బాల బాలికలకు, వికలాంగులకు, వితంతువులకు మరియు 60 ఏళ్ళకు పై బడిన వృద్ధులకు నెలకు 1,000 చొప్పున పెన్షన్లు అందజేస్తున్నాము. గుర్తింపు పొందిన వృద్ధాశ్రమాలలో నివసిస్తున్న వృద్ధులకు నెలకు 3,000 రూపాయల వంతున సహాయం అందజేస్తున్నాము. అలాగే 50 సంవత్సరాలు దాటినా వివాహం కాని లేదా ఒంటరిగా జీవిస్తున్న పేద బ్రాహ్మణ మహిళల కోసం నెలకు వేయి రూపాయల పెన్షన్ అందజేస్తున్నాము. అంత్యక్రియలకు కూడా నోచుకోని నిరుపేద బ్రాహ్మణులు ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియల ఖర్చు కోసం “గరుడ” పథకం క్రింద రూ. 10,000 సహాయం అంద జేయడం జరుగుతున్నది. ఇవే కాకుండా శ్రీ కృష్ణ సుధామ దాన నిధి, అక్షయ బ్రాహ్మణ నిధి వంటి పథకాలు కూడా అమలు జరుగుతున్నాయి.